క్లుప్తంగా

కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: మండలంలోని బలరావుపేటలో గ్రామ యువకులు నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడా పోటీలను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడల వల్ల శారీరక మానసికోల్లాసం లభిస్తుందన్నారు. సుమారు పది జట్లు క్రీడా పోటీల్లో పాల్గొంటు న్నారని, అందరు కలిసిమెలిసి క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య'

మందమర్రిరూరల్: చెన్నూర్‌లో మండలంలోని సుద్దాలలో న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టు లపై జరిగిన దాడి హేయమైనదని ఐక్య కార్మిక సంఘాల నాయకులు పార్వతి రాజిరెడ్డి, సంజయ్‌కుమార్, చాంద్‌పాష, మణిరాంసింగ్, దేవి సత్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పని తీరును, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టు లపై దాడులు భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించడమే అన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

జైపూర్: మండల కేంద్రానికి చెందిన నరేడ్ల దిలిప్‌కుమార్, కల్యాణం సంతోశ్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. మొత్తం 24జట్లు పాల్గొనగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు, ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు మద్దుల నర్సింహారెడ్డి, మున్నురుకాపు సంఘం అధ్యక్షుడు సిద్దం సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. యువతలో ఉత్తేజా న్ని నింపడానికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు, పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.15వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకి రూ.5వేల బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమిని రాజయ్య, స్థానిక యువకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

జన్నారం: బెల్లంపల్లిలో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జన్నారం మండలం కస్తూరిబా పాఠశాలకు చెందిన అంజలి, సౌజన్య మొదటి బహుమతితో పాటు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ఎస్‌వో శ్రీరాముల శ్రీవాణి తెలిపారు. అదే విధంగా నవ్య, వర్షిత, అక్షయ రెండో బహుమతి సిల్వర్ మెడల్స్, మూడో బహుమతి అక్షయ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాస్టర్ రహిమతుల్ల, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రంగనాథస్వామికి నివాళులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు దివంగత బండవరం రంగనాథస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. సాహితీ వేత్తగా, పోషకులుగా, వృద్ధాశ్రమ నిర్వాహకులుగా మోహర్‌బాబాపై ఆయన ఫిలాసఫీని ఎన్నో పుస్తకాలుగా, పాటలుగా, సీడీలుగా సామాజిక అంశాలపై తన కవిత్వంతో స్పందించేవారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, గౌరవ అధ్యక్షుడు ఆనంద్‌రావు, పూర్వ అధ్యక్షుడు మలయశ్రీ, ప్రస్తుత ఉపాధ్యక్షుడు సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ.. నీళ్లు వృథా!



దండేపల్లి: ఇంటింటికీ నల్లా నీరు అందించేందుకు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల పర్యవేక్షణ లోపంతో అభాసుపాలవుతోంది. పైప్‌లైన్లు, లీకైన చోట మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, కొన్నిచోట్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దండేపల్లి మండలం మేదరిపేట నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్డు పక్కన పైప్‌లైన్ కట్ అయ్యింది. దీంతో 20రోజులుగా భగీరథ నీళ్లన్ని వృథాగా పోతున్నాయి. అధికారులు స్పందించి కట్ అయిన పైప్‌లైన్‌కు మరమ్మతు జరిపించి, నీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మూలనపడ్డ చెత్త రిక్షాలు..!



దండేపల్లి: గతంలో గ్రామ పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు సైకిల్ రిక్షాలను(చెత్తబండ్లు) వినియోగించేది. ప్రస్తుతం పల్లె ప్రగతిలో భాగంగా ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలకు ఇళ్లలోని చెత్తను తరలించేందుకు ప్రతి గ్రామ పంచాయతీకో ట్రాక్టర్‌ను అందించింది. దీంతో ట్రాక్టర్ల రాకతో గతంలో వినియోగించిన చెత్త బండ్లు(రిక్షాలు) ప్రస్తుతం మూలనపడ్డాయి.

పొంచి ఉన్న ప్రమాదం



దండేపల్లి: మండల కేంద్రంలోని తెనుగువాడ సమీపంలో డీ-28 కాల్వపై నూతనంగా నిర్మించిన కల్వర్టును ఆనుకుని ఉన్న 25కేవీ, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ తక్కువ ఎత్తులో చుట్టూ ఎలాంటి కంచె, లేకుండా ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి, ట్రాన్స్‌పార్మర్ చుట్టూ కంచే ఏర్పాటు చేసి, గద్దె ఎత్తుగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

కంకర వేశారు.. బీటీ మరిచారు



భీమారం: మండలంలోని కాజిపల్లి నుంచి ఆవిడం వరకు గల ప్రధాన రహదారిలో పాత రోడ్డు తొలగించి కొత్తగా బీటీ వేసే పనులను త్వరగా పూర్తి చేయకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాజిపల్లి-ఆవిడం మధ్య కంకర వేసి బీటీ(బ్లాక్ టాప్) నిర్మించకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని బీటీ నిర్మించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి: అన్నయ్య, డీఈఈ ఆర్‌అండ్‌బీ ఫోన్ నంబర్ : 7382625560

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామకృష్ణాపూర్: బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బీఆర్‌ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య శిబిరాన్ని ప్రారంభించారు. కరీంనగర్ అపోలో రీచ్, మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రులకు చెందిన వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు మెగా వైద్య శిబిరంలో సేవలందించారు. సుమారు 800మందికి పైగా శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేపించుకున్నారని, వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశామని వైద్య శిబిరం నిర్వాహకుడు, 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్‌గౌడ్, యాకూబ్‌అలీ, ఆశాల రాజన్న, జాడి శ్రీనివాస్, పార్వతి విజయ, అనిల్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడిగా చంద్రమొగిలి



కండువా కప్పి అభినందిస్తున్న మణిరాంసింగ్

బెల్లంపల్లి: స్థానిక టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏరియా సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) ఉపాధ్యక్షుడిగా టీ.చంద్రమొగిలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వెంబడి రాములు, ఏ.శ్రీనివాస్ ,డి.నర్సింగంలను ఎన్నుకున్నట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.మణిరాంసింగ్ ప్రకటించారు. కొత్తగా ఎంపికైన నాయకులకు కండువా కప్పి అభినందించారు. సమావేశంలో రీజియన్ ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎండి హాసన్, మల్లయ్య, రవి, శంకర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకునేది లేదు'



మాట్లాడుతున్న ఏమాజీ

నెన్నెల: బీజేపీ కార్యకర్తలను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెదిరిస్తున్నాడని, బెదిరిస్తే ఊరుకునేది లేదని బెల్లంపల్లి బీజేపీ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ హెచ్చరించారు. మండలంలోని జోగాపూర్, కోణంపేట గ్రామాలల్లో ఆదివారం 'ప్రజాగోస- బీజేపీభరోసా' కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను తామే చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పా చేసింది ఏమి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించి కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మెన హరీష్‌గౌడ్, కార్యదర్శి గోవర్ధన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు విజయ్, కేశవరెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, రాజలింగు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

కాసిపేట: నేతకానీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏస్కూరి రాయమల్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గం మహేందర్, కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా మండల కమిటీ, మహిళా, యూత్, గ్రామ కమిటీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: భారత్ బచావో ఆధ్వర్యంలో మార్చి 11, 12తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే భారత్ బచావో జాతీయ సదస్సును విజయవంతం చేయాలని భారత్ బచావో మంచిర్యాల శాఖ నాయకులు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామునిచెరువు పార్క్‌లో ఆదివారం జాతీయ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులు, రైతులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని,
నిత్యావసరాల ధరలు పెరగడం వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడిందన్నారు. దేశ సంపదలను అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూస్తుందని ఆరోపించారు. బీజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అరికట్టడానికి ఢిల్లీలోని హెచ్‌కేఎస్ సుర్జిత్ భవన్, డీడీ ఉపాధ్యాయమార్గ్‌లో సదస్సును 'భారత్ బచావో' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి దేశంలోని మేధావులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, నాయకులు కనుకుట్ల మల్లయ్య, ముస్లిం మైనారిటీ నాయకులు ఎండీ ఇబ్రాహీం, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కుర్సింగ వెంకటేష్, గొల్లకురుమ హక్కుల పోరాట సమితి నాయకులు సమ్ము రాజయ్య, భారత్ బచావో నాయకులు పాల్గొన్నారు.

బీడీ ఆకుకట్ట ధర పెంపుపై హర్షం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 2023సంవత్సరానికి గాను బీడీ ఆకు కట్ట ధరను రూ.2.05పైసల నుంచి రూ.3కు పెంచడంపై తెలంగాణ ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, అటవీ శాఖా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి అసోసియేషన్ విన్నవించిన మేరకు బీడీ ఆకుకట్ట ధరను రూ.3కు పెంచడంపై అభినందనలు తెలిపారు. దీని వల్ల బీడీ ఆకు సేకరణ కార్మికులకు కూడా ప్రయోజనం చేకూరనుందని అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రంగారెడ్డి, కార్యదర్శి ఇస్మాయిల్ అహ్మద్ జుల్ఫేకర్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జయంతి



రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

జన్నారం: మండలంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సద్గురు రాఘవేంద్రస్వామి జయంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు జక్కు సత్తయ్య, రంగ శ్రీనివాస్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, నాయకులు శ్రీనివాస్, సుధాకర్, రమేశ్, పూజారి గణేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దికల్‌లో మల్లన్న పట్నాలు



పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో ఆదివారం మల్లన్నస్వామి ఒగ్గు పూజారుల ద్వారా పట్నాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. వేలాల మల్లికార్జున స్వామి దేవాలయం ప్రధాన ఒగ్గు పూజారి చీర్ల గట్టయ్య నేతృత్వంలో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యంలో పట్నాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణా ఒగ్గు పూజారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డేగ రమేశ్ తన గురువు చేతుల మీదుగా గవ్వ దారణ తీసుకున్నారు.

కర్ణమామిడిలో ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామంలో ఆదివారం లక్సెట్టిపేట త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇంటింటా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ గ్రంథాలను చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని ఈ సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రచారం చేపట్టినట్లు చెప్పారు. ఈ గ్రంథాలను చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకుని ధర్మస్థాపనకు పాటుపడేలా చూడాలన్నారు. ప్రచారంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి లక్సెట్టిపేట కమిటీ అధ్యక్షుడు రాజు, సభ్యులు నాగిరెడ్డి, రమేశ్, మహేశ్, అనుతేజ్, రవళి, స్వాతి, సాహిత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం



ఆశీర్వచనం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామపంచాయతీలో వారం రోజుల నుంచి శృంగేరి శారద పీఠ ఆస్థాన పౌరాణికులు పౌరాణిక ప్రవక్త బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రితో నిర్వహిస్తున్న శ్రీ మద్భాగవత సప్తాహం కార్యక్రమంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ పాల్గొని పండితులు సంతోశ్‌కుమార్ శాస్త్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి గొప్ప పండితులని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి సురేఖా, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి, నాయకులు శశిపాల్‌రెడ్డి, గుర్రం రాజన్న, గట్టాగౌడ్ సర్పంచ్‌లు లక్ష్మణ్‌గౌడ్, పానెం శంకర్, జెల్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



పోచమ్మ బోనాలతో మహిళలు, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక పోచమ్మ చెరువు వద్ద రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్ తొలి బోనమెత్తారు. కళాకారుల ఆటపాటలతో స్థానిక వసంత టాకీస్ నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి పోచమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ప్రకాశ్‌గౌడ్, జీవన్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, సందీప్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భైరవస్వామికి భక్తుల పూజలు



భైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలోని భైరవ స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ప్రముఖ పండితులు బాచంపల్లి సంతోశ్‌కుమార్ శర్మ భైరవుడి గొప్పతనం భక్తులకు వివరించారు. రానున్న రోజుల్లో పార్‌పల్లి భైరవక్షేత్రం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని ఆకాంక్షించారు. కాశీకమాతకు హారతులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, చెన్నూర్ పట్టణానికి చెందిన మర్వాడీలు కుటుంబసభ్యులతో తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలతో పుష్పాలంకరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో బోనాలు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి, తీపి పదార్థాలతో స్వామి వారికి నైవేద్యం పెట్టారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

అక్కెపల్లిలో వనభోజనాలు



చిన్నారుల సందడి

చెన్నూర్‌రూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయం వద్ద ఆదివారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. కుటుంబ వ్యవస్థ బలోపేతం , సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోకుండా ఉండేందుకు ఈ సామూహిక వన భోజనాలను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి చెన్నూర్ నుంచి సుమారు 50వరకు కుటుంబాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా ఆట, పాటలతో పాటు భజనలు చేశారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు.

'సైఫ్‌ను శిక్షించాలి'

పాతమంచిర్యాల: కాకతీయ వైద్యకళాశాల పీజీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సీనియర్ వైద్య విద్యార్థి మహ్మద్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రీతిని తక్కువ కులం అంటూ సైఫ్ హేళన చేయండతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. ఆయన వెంట సేవాలాల్ సేనా మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ జ్యోతిభాయి, శంకర్ నాయక్, శంఖాలాల్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.